# ఖాళీ గది

కన్నడ మూలం :

## యశవంత చిత్తాల

తెలుగు అనువాదం :

## శంకరగంటి రంగాచార్యులు

"ఏం ప్రియా...?

నేనంటే మీకంత ప్రేమా?"

"ఇంకా సంశయమా ?"

నాలో ఏముందని నన్ను మెచ్చుకున్నారు?"

"ఓసి, మాటలమల్లి ! ఏముందని?...చెబుతాను! పెదాలిటు తిప్పు..."

మళ్ళీ అదే పగటి కల !

బాట ప్రక్కన పెద్ద కిటికీ దగ్గర కుర్చీలో కూర్చుని భావ సమాధిలో మునిగిన నిర్మల పగటి కలలోకి అనంతుడు వచ్చి వున్నాడు. తన కండలు తిరిగిన పురుష బాహువులతో ఆమె అల్లలాడే దేహాన్ని చెరపట్టి, ముద్దు ముద్దుగా వుండే ఆమె పెదాలను ముద్దు పెట్టుకుంటూ, ప్రతి అవయవంలోనూ పులకల్ని రేపుతూ న్నాడు. ఆహా! ఎంతటి ఆనందముంది, సుఖముంది ఆ పురుషాలింగనంలో...!

"...అనంతుడు పాతికేళ్ళ యువకుడు...చురుకైన బుద్ధి, నేర్పరి...! చూచేందుకు మన్మధునిమూర్తి..."

నిర్మల ముఖం మీద మొలకనవ్వు తొణికిసలాడింది: తనకు ప్రప్రథమంగా అనంతుడి పరిచయమైందే ఆ మాటలతో.

అనంతుడి పరిచయం...!

నిర్మల ముఖం మీద తొణికిసలాడిన మొలకనవ్వు విప్పారి నిలిచింది: ఇపుడు తన మనస్సులో మెదలాడిన ఈ సంగతిని ఎవరైనా నమ్మగలరా? అనంతుడిని తను ఇంకా చూడనైనా చూడలేదు! అయినా కడచిన మూడు రోజుల్లో...తమ యింటి ప్రక్కన ఖాళీగా వున్న గదిలో అతడు వుండటానికి వస్తాడని తెలిసిన ఈ మూడు రోజుల్లో - అతడు తనకు ఎంతటి దగ్గరివాడయివున్నాడు! ఎంతటి దగ్గరివాడు...? నిర్మలకు గిలిగింతలు పెట్టినట్టవుతుంది - ఈ ప్రశ్నకు జవాబివ్వడానికి ప్రయత్నిస్తే—

ఇప్పటికి సుమారు పదిహేను రోజులైనాయి; నిర్మల యింటి ప్రక్కగది ఒకటి ఖాళీగా వుంది. ఖాళీగావుంటే ఆమెకేమట! వందలాది యిళ్ళున్న ఈ మూడంతస్తుల వరుసల్లో ఇలా ఎన్ని గదులు ఖాళీ అవుతాయో, ఎన్ని భర్తీ అవుతాయో! ఖాళీకానీ, భర్తీకానీ ఆమెకేమట! ఆమెకేమీకాదా? ఏమేమో...? కాదని ఎలా చెప్పటం...? గది కాళీ అయిందని తెలిస్తే, అక్కడ వుండేందుకు ఎవరైనా కొత్తవాళ్ళు వస్తారుకదా! అలా వచ్చేవాడు. ఒక కాలేజీలో చదివే (లేక, చదివిన?) సుందర యువకుడు కావచ్చు. అక్కడికి వచ్చేవాడు అందగాడే అయివుండాలి, యువకుడే అయ్యుండాలి - అనే షరతునేమీ ఆ యిళ్ళ యజమాని పెట్టలేదు, నిజం. అయినా... వచ్చినవాడు యువకుడే అయితే ... అలానే తనకూ అతడికీ పరిచయం (గాఢమైందా?) యేర్పడితే ... మొత్తం ఆ వరుసలోనే అతి లావణ్యవతి అని పేరు పొందిన ఆమె మీద అతడి ప్రే...మ ప...డి...తే... (పడకుండా వుంటుందా!) ...తర్వాత?...తర్వాత...ఏం కావొచ్చు?...ఏమిటి?... ఒకదాని తరువాత ఒకటిగా తోసుకు వచ్చే ఈ ప్రశ్నల అదృశ్యపు గొలుసు ఒకటి ఆమెను ఆ ఖాళీ గదికి బంధించింది: దానికీ ఆమెకూ గాఢమైన, గూఢమైన సంబంధాన్ని కల్పించింది.

ఈ ఖాళీ గదిని గురించి తన తలలో పగలంతా నడిచే కోలాహలం - తాలూకు స్పృహ కలిగి నిర్మల ఒకొక్కసారి తనలో తనే నవ్వుకుంటుంది. మరుసటి క్షణం జుగుప్సను చెందుతుంది. ఒక్కొక్కసారి అవ్యక్త భయంతో వణకుతుంది: మరొకసారి ఊరకనే మండిపడుతుంది. ఈ పాడు గదివల్ల తను తన మనశ్శాంతినెందుకు పోగొట్టుకోవాలో - అంటూ చిడిముడి పడుతుంది: అయ్యో! ఈ అనిశ్చితతకు అంతమేలేదా? వృద్ధుడుకానీ, యువకుడుకానీ, (యువకుడేకానీ దేవుడా!) అందగాడుకానీ కురూపికానీ, (అందగాడే కానీ, నా అదృష్టమా!) - ఎవరికైనా కావలసినవాడుకానీ, కాకపోనీ, (అతడు "నావాడు" కానీ, నా పుణ్యమా!) - వచ్చి ఆ గది ఒకసారి భర్తీ కారాదా?...భర్తీ కారాదా? దినాలు గడచినకొద్దీ ఆ "అదృశ్యపు గొలుసు" తాలూకు బంధం బిగింపు అధికాధిక మవుతోంది

తను దూరం పోవడానికి ప్రయత్నించినకొద్దీ, ఆ గది తన దగ్గర దగ్గరకు వస్తోంది. కడపటికొకసారి - మూడు రోజుల క్రితం వచ్చింది, ఆ శుభవార్త, గాలిలో తేలుతూ;

ఆరోజు నిర్మల వంటగదిలో రాత్రి భోజనం తయారు చేయడంలో వుంది. ఎక్కడో, దూరంలో రెండవ అంతస్తులోని మహిళ ఒకతె, ఎదురు వరుసలోని మహిళతో మాటా-మంతీ సాగిస్తోంది. వందలాది యిళ్ళ ఆ వరుసల అల్లరిలో వాళ్ళ మాటలు నిర్మలకు స్పష్టంగా వినిపించడం లేదు. అయినా ఆ మాటలు తమ యింటి పక్కనగల ఖాళీ గదిలో ఉండటానికి వచ్చేవాళ్ళను గురించి అని తెలిసినందున చెవులు రిక్కించుకుని విన్నపుడు అదుకులదుకులుగా వినిపించిన మాటలివి:

"ఔనమ్మా...అనంతుడని...పిల్లవాడు మంచి చురుకు బుద్ధి కలవాడు...నేర్పరి...చూచేందుకు మన్మధునిమూర్తి...వయస్సు ఇరవై అయిదు" ఛీ! ఈ వరుసిళ్ళ పాడు గందరగోళం! ముందరి మాటలు నిర్మలకు వినిపించనేలేదు. అయినా, వినిపించిన ఆ మాటల వల్లనే తనకెంత గగుర్పాటు! అనంతుడు! ఎవరో, ఎవరో ఒక అనంతుడు! వట్టి ఒక పేరు - వట్టి ఒక శబ్దం; అనంతుడు. అందులో అదెంతటి దివ్యతవుందో, అద్భుత రమ్యతవుందో! కడచిన మూడు రోజుల్లో గాలిలో తేలివచ్చిన ఆ పేరునే అదెన్నోసార్లు స్మరించుకుంది! రాను రాను - "ఎవరో ఒకడు" - ఐన అనంతుడు, వట్టి శబ్దమాత్రుడైన, (నిరాకార, నిర్గుణుడైన) ఆ అనంతుడు తన దేహం, మనస్సూ, ఆత్మా - అన్నింటినీ నింపి, తుదకు సాకారుడై, ప్రకటింపబడి వున్నాడు-కలలో! తనకర్థమయ్యే రూపంలోనే, హితమైన రీతిగానే:

"టక్...టక్...టక్"

ఛీ! ఎవరో తలుపు తడుతున్నారు. కొంచెంసేపు హాయిగా పడుకుందామంటే..."టక్...టక్..." తట్టనీ, తట్టనీ. నేను లేవలేను. ఎవరో, పళ్ళమ్మేవాడో, ఆటవస్తువులమ్మేవాడో అయివుండాలి. తట్టనీ! తట్టి, తట్టి, చేయి సోలిపోయిన తర్వాత తనే పోతాడు. నేను లేవలేను. హా! ఎంత తీయని నిద్ర!...అదే మళ్ళీ...లేచి చూడటమే మంచిదేమో!...చీవాట్లు పెడితే తప్పపోదేమో...

"ఎవరూ ఆ! అదే మీరు! ఎ...ఎవరు కావాలి?"

"మీరే...అంటే...అంటే మీతోనే పనుండి. నేను అనంతుడు...అనంతుడని నా పేరు... ఇక్కడే మీ పక్కగదిలో ఉండటానికి వచ్చాను."

"అయ్యయ్యో...లోపలికి రండి."

"లేదు...లేదు ... పాపం! పడుకున్నారేమో, ఊరకనే తొందర కలిగించాను...నేనిపుడు కొంచెం బయటికెళ్ళాలి. పాల వాడొచ్చేందుకింకా ఆలస్యమేమో...ఈ పాత్ర ఇక్కడ పెడతాను... అరసేరు పాలు తీసుకుంటారా?..."

దద్దమ్మ ఎంతగా సిగ్గుపడ్డాడు నన్ను చూచి! ప ప ఫ ప అన్నాడు కదూ, యం బ్రహ్మా! 'ఎవరు కావాలి' అంటూ అడిగితే 'మీరే' అట! పూర్తి నర్వస్ అయిపోయాడు...ఖుక్!

"ఏయ్ నిమ్మీ, ఎందుకే నవ్వుతున్నావ్, అలా? ఏం కల కంటూవుందో, యేమో, పిచ్చిపిల్ల!"

"ఆ! ఏమక్కయ్యా, పిలిచావా?"

'ఎవరు వచ్చారే కలలో?, ఆ తొట్లలో పడుకున్న ఆ చిన్నారి లలితలాగా నవ్వుతున్నావు కదవే? నిద్రలో! లేవే లేవే! టీ చల్లారి పోతూవుంది...'

ఆనాటి మధ్యాహ్నమే - ఇప్పటికొక గంట మునుపు-జరిగిన ఈ సంఘటనను స్మరించడంవల్ల నిర్మలకు ఇప్పుడు కూడా 'ఖుక్' అంటూ నవ్వు వచ్చింది. అయ్యో' కలలో మరేమేమి పలవరించానో.

కలలో అనంతుడు తన్ను చూసి నర్వస్‌గా ప్రవర్తించాడని నిర్మల నవ్వినా, వాస్తవంగా నర్వస్ అయింది. తనే అని నిర్మలకు తెలుసు. ఆరోజు, తలవని తలంపుగా, అనంతుని ఆగమన వార్త తన చెవిలో పడినపుడు, తనకు కలిగిన గగుర్పాటుకు తోడు ఒక విచిత్రమైన భీతిచేత జీవం తనకుతానే వణికింగి...అయితే యిపుడు? ఇపుడు, ఇపుడు అతడు తనకెంతటి దగ్గరివాడుగా పెరిగి నిలిచాడు! ఎంతటి దగ్గరివాడు?... కొద్ది నిమిషాల ముందే రాలేదా? - తన్ను భుజపంజరంలో బిగించి, అందమైన తన పెదాలను -

'హో...హో...హో! రోఖో; రోఖో!'

క్రింద బాట మీద ఏవో కేకలు! కల్పనల ప్రవాహంతో పాటు ప్రవహిస్తున్న నిర్మలను ఎవరో హఠాత్తుగా చేయిపట్టుకుని, ఆపినట్టయింది. ఆమె భావ సమాధికి భంగం కలిగింది. ఆమె ఒక్కసారిగా కూచున్న చోటి నుంచి లేచి, బయటికి చూచింది. క్రింద, మునిసిపాలిటీ ఆరోగ్యశాఖ ట్రక్కు ఒకటి రస్తా మీద ప్రోగుచేసిన చెత్తకుప్పను ఎత్తుకుపోవడానికి వచ్చి నిలిచింది. కూలివాళ్ళు ఆ చెత్తలో చేతులుంచి, దాన్ని బుట్టల్లో నింపి, ఎత్తి, ట్రక్కులోకి వేస్తున్న ఆ దృశ్యం చూసినపుడు ఒళ్ళు జలదరించింది. మరుక్షణం ఆ పేదవాళ్ళపట్ల కరుణ పొంగి వచ్చింది - ఎదలో: ఇక కొద్ది రోజుల్లోనే రానున్న తన (ఇంతలోనే!) అనంతుడిని ఆహ్వానించడానికి ఖేతవాడి సందుగొందులన్నీ స్వచ్ఛపడుతున్నాయనే భావనున్నదేమో, ఆ కరుణలో! ఈ దృశ్యం ఇంతకు మునుపు తను ఎన్నిసార్లు చూడలేదు! అయితే అలా చూచిన ప్రతిసారి కూడా నిర్మల మనస్సులో ఖేతవాడి పట్ల వేరే భావం వుండేది.

నిర్మల బొంబాయికి వచ్చి ఇప్పటికి అయిదు నెలలయ్యాయి. ఆమె యిప్పుడు బొంబాయిలో వుంటూన్నది ఆమె అక్కయింట్లో. ఖేతవాడిలోని ఒక సందులోని మూడంతస్తుల ఒక పాత వరుసలో మూడో అంతస్తులోని - రస్తా ప్రక్కనగల - చివరి రెండు గదుల్లో ఆమె అక్క సంసారం; భర్తా, భార్యా, ఎనిమిది నెలల పిల్ల - లలిత. ఈ లలిత కోసమే అక్క తన్ను బొంబాయికి పిలుచుకు రావడం. అక్క కాన్పుకని ఊరికి వచ్చినప్పుడే, తను ఆమెతోపాటు బొంబాయి వెళ్ళడం నిశ్చయమైంది: చిన్న పిల్లతో వెనుదిరిగివెళ్ళే అక్కకు సాయపడడానికని. ముద్దుల అక్క! ఆమె సాయానికై వుండడమంటే తనకెంత ఆనందం! అయితే, దానికన్న ఎక్కువగా, తను ఇన్ని రోజులుగా ఊరికేవిని, ఇంద్రుని అమరావతిలా ఉండవచ్చునేమో అంటూ (చూశావేమే, ఇంద్రుని అమరావతిని) కల్పించుకుని, కలల్లో చూసి ఆనందించిన బొంబాయి నగర భవ్యవైభవాన్ని కళ్ళారా చూడాలనే కుతూహలం! అందుకన్న ఎక్కువగా-తలుచుకుంటే సిగ్గేస్తుంది: తన తండ్రి మాటలు...

ఆమె తండ్రి బొంబాయికి దూరంలో ఉండే ఒక పల్లెలో ఉపాధ్యాయుడు. ఇద్దరు ఆడ, ముగ్గురు మగపిల్లల తండ్రి. ఉత్తమమైందీ కాదు, తీరా బీదరికందీ కాదు - అనే మధ్య తరగతి స్థితి. ఆడపిల్లలే పెద్దవాళ్ళు——పెళ్ళి కెదిగినవాళ్ళు. ఇద్దరూ అందగత్తెలు. పెద్దపిల్ల, సుశీల, మెట్రిక్ పాసయింది. చిన్నదే నిర్మల. చదువులో అంతటి చురుకుదనంలేనందున మధ్యలోనే బడి వదిలిపెట్టింది. నిర్మల మామ ఒకడు పూనాలో ఉన్నాడు. ఇప్పటికి సుమారు రెండేళ్ళ క్రితం, ఈ మామ ఒకసారి నిర్మలనూ, వాళ్ళక్కనూ పూనాకు పిలిపించాడు. అప్పుడు అతడి ప్రక్కయింటికి అతిథిగా వచ్చిన యువకుడొకడు అక్కను చూసి, మెచ్చుకుని, చివరకు నేరుగా వాళ్ళ మామతో పెళ్ళి ప్రస్తావన చేయడమా? పిల్లవాడు చెడ్డవాడిలా కనిపించలేదు. ఆరోగ్యవంతుడు. బొంబాయిలో చిన్నదైనా సరియైన ఉద్యోగముంది. ఇన్ని గుణాలుంటే కాదనేందుకవుతుందా? ఎవరూ కలలో కూడా తలవనట్టి సులభ పద్ధతిలో —— ముఖ్యంగా, ఒక్క పైసా కూడా వరదక్షిణ లేకుండా తర్వాతి రెండు నెలల్లో అక్క పెండ్లి అయిపోయింది! అక్కకూ, తన తల్లిదండ్రులకూ, తనకు కూడా - కలిగిన ఆనందమెంత! బొంబాయి పూనాల్లాంటి పెద్ద పట్టణాల్లో అందగత్తెలైన ఆడపిల్లల పెళ్ళిళ్ళవడమే ఇలాగట!! అందుకే కదూ, అక్క, పాపతో బొంబాయికి వెళ్లేందుకు కొద్ది రోజులకు ముందు, తన తండ్రి తన పెళ్ళి గురించి, మాట వరుసకు అక్కకు సూచించడం - నవ్వుతూ నవ్వుతూనే...

హఠాత్తుగా తన చెవుల్లో పడిన ఆ మాటలవల్ల తనకదెంతటి గగుర్పాటు! తన పెళ్ళి! తను పెళ్ళికెదిగి కూచుందా? తనకప్పుడు కేవలం పదారేళ్ళు అయినా తన తండ్రిగారి ఆ చిన్న సూచనవల్లనే, తను ఒక్కసారిగా ఎదిగి కూచున్న అనుభవం కలగడంలేదా? తన ఎదిగివుండే, కాంతి ప్రసరించే, ప్రతి అవయవమూ ఇదే అర్థాన్ని అభివ్యక్తీకరించడం లేదా? ... తనిప్పుడు పెళ్ళి కెదిగి కూచున్న పిల్ల!... తను అక్కతోపాటు బొంబాయికి రావడం ఊరికే బొంబాయి వైభవాన్ని చూడడానికి కాదు. చిట్టిలలిత తల్లిగావచ్చిన అక్కకు సాయం చేయడానికి కాదు. తనకొక భర...త...భీ...(సిగ్గు)...

బొంబాయికి వచ్చిన తర్వాత మాత్రం తన ఆపేక్షలన్నీ తారుమారయ్యాయి. ఆ రోజు తండ్రి వినోదపు మాటల్లో సృష్టింపబడి వచ్చి తన హృదయ కవాటాల్ని తట్టిపోయిన - బావస్నేహితుడై (లేక ప్రక్కయింటి 'వాళ్ళ అతిథియై ?) రానున్న - ఆ యువకుడు ఇంతవరకూ రానేలేదు - తమ యింటి తలుపు తట్టనేలేదు. నిర్మలకు ఊరకూరకనే కోపం వస్తుంది - అక్కమీద, బావమీద-అవరుసిళ్ళ అన్నింటిమీదా! ఇల్లేమో, మూడో అంతస్తులో, స్వర్గానికి సమీపంలో! అయితే ఇక్కడ కనిపించేదంతా నరకపుదృశ్యమే! ఎప్పుడూ కుళ్ళిన చెత్తతో కంపుకొట్టే ఇరుకు రస్తాలు. ఒక గది, రెండు గదుల పెట్టెల్లాంటి ఇళ్ళలో అయిదారుమంది ఇరుక్కున్న సంసారాలు, ఒకదాని ప్రక్కన ఒకటి, ఒకదానిమీద ఒకటి నిలిచిన ఈ ఇళ్ళు ఇళ్ళా - పావురాళ్ళగూళ్ళు! అనేక యిళ్ళు ఒకే కట్టడంలో! అనేక కులాల, అనేక తరగతుల, జనులు! - పల్లెలో మొత్తం తమ వీధిలో అంతావున్న జనం ఒక వరుసలో! అయ్యో! ఇక్కడి బ్రదుకు!

మొదట్లో చాలా రోజుల వరకూ ఇక్కడి యాంత్రిక జీవనానికి సర్దుబాటు చేసుకోవడమే కష్టమనిపించింది-నిర్మలకు. బావకు ఎక్కడో ఒక ప్రయివేటు కంపెనీలో ఉద్యోగం. ప్రొద్దున పది గంటల్లోపలనే భోంచేసి పోవాలి. అందుచేత, ప్రొద్దున లేస్తూనే ఒకొక్క కప్పు టీ తాగిన శాస్త్రం ముగిస్తూనే, వంటపని. బావ భోజనం అవగానే, పదకొండు గంటల్లోపల తనదీ భోజనం - చేసిన వంట కాలు చల్లారి పోతాయని. సుమారు పన్నెండు గంటల సమయానికి పని సునిషి వస్తుంది. భోజనం పని ముగిశాక సాయంత్రం టీ వేళ దాకా ఏం పనుంది? హాయిగా నిద్రపోవచ్చు! అయితే రాత్రి చేయడానికేమైనా పనివుండాలిగా! అప్పుడు నిర్మల ఇలా ఈ కిటికీ దగ్గర కూచుని చుట్టూ చూపులు ప్రసరిస్తుంది. ముందరి కట్టడాలలోని-పావురాళ్ళ గూళ్ళలోనూ - ఏమిటో, దేన్నో వెదుకుతుంది. పై వరుసల మగవాళ్ళందరూ అప్పుడే తమ తమ పనుల మీద తొందర తొందరగా వెళ్ళారు. ఇళ్ళలో ఉత్త ఆడవాళ్లు-లేకుంటే

చిట్టి చిట్టి పాపలు ! వేలాడి మంది క్రిక్కిరిసి నివసిస్తూన్న ఖేత వాడి కూడా విచిత్రమంటూ వుంది. ఏం పని లేక, విసుగుపడుతూ కూచున్న నిర్మల తలలో లేనిపోని ఆలోచనలు మెదలాడుతాయి. దిన దినప్రవర్ధ మానమవుతూన్న ఆమె సౌందర్యమూ, "ఈ దేహాన్ని సింకి, నిబిడీకృతమై బయటికి ప్రవహించాలి, ఇతరులమీద తన ప్రభావం వెదజల్లాలి అంటూ తొందరపడే ఆమె యౌవనమూ - ఖేతవాడిలోని ఈ రూక్ష వాతావరణంలో ఊపిరాడక "అయ్యో!" అంటూన్నాయి. అప్పుడు—అప్పుడు— "ధూ" అంటూ గట్టిగా ఉమ్మివేయాలని అనిపించింది నిర్మలకు : అనేక రోజుల క్రితం తనుచేసిన ఒక దుష్కార్యం తాలూకు స్మృతివల్ల ఆమె మనస్సుకు అసహ్యం కలిగింది :

ఆ రోజు ఆమె మధ్యాహ్న భోజనమూ, వంటింటిపనీ ముగిశాక, ఇలానే ఈకిటికీ దగ్గర నిలుచుకుని తన ప్రతి దినపు ఆటలో నిమగ్నురాలై వుంది. చువ్వలులేని ఆబోలు కిటికీలోనుంచి వీలైనంతగా తలను బయటికి చాచి, క్రింది రస్తామీద వెళ్ళే వాళ్ళను చూస్తోంది. ఇలా నిలుచున్న కొద్దిసేపటికి గాలిచేత నిర్మల చీర కొంగు యెదనుంచి క్రిందికి జారింది. కిటికీనుంచి తల బయటికి చాచుతున్నపుడు వక్షస్థలం కిటికీ చట్టానికి ఆనుకుని వుండడంచేత యౌవనం పొంగుతూవున్న ఆమె ఉన్నత స్తనాలు మరింత వున్నతంగా కనబడుతూన్నాయి. దీని స్పృహకలిగి నిర్మల నాడుల్లో వెచ్చని అనుభవమొకటి అంతటావ్యాపించింది. అప్పుడుఎదుటి కట్టడపు నాలుగో అంతస్తుతాలూకు - తనకు ఎదురుగావున్న - కిటికీలో ఒక పిల్లవాడు ! పాపం; ఇంకా మూతిమీద మీసపు గీతలు కూడ మొలవని లేతవాడు! - కిటికీ ప్రక్కన కూచుని చదువుకొంటూన్నవాడు, ఏదో కుతూహలంతో లేచి నిల్చిచి, తనలానే బయటి రస్తామీదికిదృష్టి సారించివున్నాడు. ఇంతకు మునుపు తను వాడిని అనేక పర్యాయాలు చూసివున్నా కూడా, "వట్టియంబ్రహ్మ" అనేంతకన్నా ఎక్కువగా తనభావన పోలేదు. అయితే, ఎలా అయినా మగవాడుకదా ! అతడి ఉనికిని తను గమనించిన వెంటనే స్త్రీ సహజ లజ్జవల్ల తన జారిపోయిన చీరకొంగు సరిపోవలసివుంది. అయితే అది జరుగలేదు. తనకన్న ఒక అంతస్తు ఎత్తులో నిలుచున్న అతడికి తన చీరకొంగు యొక్క ఆ అస్త వ్యస్తస్థితిలో తన అందమైన పీనస్తనాలుస్పష్టంగా కనిపిస్తుండాలి - కాదు ఆమగ, కళ్ళు వాటిని చూడాలి - అనే అస్పష్టవాంఛ ఒకటి తన్ను నిలుచున్న చోటినుంచి కదలడానికి వదలలేదు. కొంచెంసేపు తర్వాత కళ్ళెత్తి చూస్తే ఆయంబ్రహ్మకళ్ళు తనమీద అవి వున్నాయి. అరక్షణంలో తమ దృష్టులు కలిశాయి. తనకు తెలియని ఒక తుంటరి భావం తన్ను ఆ పిల్లవాడిని గురించి మృదువుగా, అర్థ పూర్ణంగా నవ్వేలా చేసింది. ఏమీ తెలియని పిల్లవాడు, పాపం, తికమకపడ్డాడు. చివరికి భయపడి అక్కడినుంచీ ఉడాయించాడు. నిర్మలకు తనకు వచ్చిన నవ్వు పట్టడానికి లేదు; పిచ్చివాడు ! ఇలా కూచుని కూచుని విసుగుపుడుతుంది. కొంచెం సేపు ప్రేమను ప్రకటిద్దామని - వూరకనే నవ్వితే, తన్ను పెళ్ళి చేసుకుంటానని అనుకున్నాడోయేమో—దద్దమ్మ !— మరుక్షణం తన చర్యపట్ల తనకే జుగుప్స కలిగింది, నిర్మలకు! కిటికీ దగ్గర్నించీ ఉడాయించేటప్పుడు ఆ పిల్లవాడి ముఖం మీద వట్టి భయంలేదు-తన పట్ల పూర్ణతిరస్కార భావముంది. అయ్యో ? తనకేమైంది ?— ఏమైంది—అదేమైంది ?—

నిర్మలయొక్క ఈ ప్రశ్నలకు జవాబు దొరికింది. ఇది జరిగిన చాలా రోజుల తర్వాత; ఇదే సందులో నివసిస్తూన్న ఇంద్రాణీ, కుముదల పరిచయమైన తర్వాత. ఇలాంటిదే ఏదో ఒకసందర్భంలో కుముద, నిర్మల చెక్కును మృదువుగాగిల్లి, అన్నది :

"నీకేమీ కాలేదు,పిల్లా. ఇదంతా నీవయస్సు మహిమ. నాన్నకు చెప్పి, త్వరగా ఒక—".

"ఊరకోవే వదరుబోతూ" నిర్మల అప్పుడు తెచ్చికోలు కోపం చూపింది. అదే సందర్భం—?—?

స్మృతుల వెన్నంటి వెళ్ళిన నిర్మల ఒక్కసారిగా అదిరిపడింది. క్రింద రస్తామీద నిలబడి ఆమె స్నేహితురాలు ఇంద్రాణి కేకేసి పిలుస్తోంది

"నిమ్మీ—నిమ్—మ్మీ"

అయ్యో ! ఈ సింధీపిల్లకు సభ్యతే వున్నట్టు లేదు ! మగరాయడిలా రస్తాలో నిలబడి బిగ్గరగా కేకేస్తోందికదా-నిర్మల మనస్సులోనే నవ్వుకుంది - గత నాలుగు మాసాల్లో తనకు అత్యంత సన్నిహిత స్నేహితురాలిగా అయిన ఇంద్రాణిని ఇదే మొదటిసారిగా అర్థము చేసుకున్నట్లు.

నిర్మల అదిరిపడడం చూసి, ఇంద్రాణి నవ్వుతూ అడిగింది:

"ఏయ్. పిచ్చిదానా! ఏం కలకంటూన్నావే ఇప్పుడెన్నిసార్లు కేకేసి పిలిచాను. అదేం చూస్తున్నావే, అంతగా నిమగ్నురాలై?"

"ఛీ. పిచ్చిదానా ! పైకి వచ్చయినా మాట్లాడరాదా ?"నిర్మల సిగ్గుపడి స్నేహితురాలి ప్రశ్ననుంచి తప్పించుకోవాలన్నట్లు, క్రింద రస్తామీద టక్కు నిలబడిన చోటును సైగచేసి చూపింది.

"అక్కడే ముందే ?"

అప్పుడర్థమైంది, నిర్మలకు ! ఇంతకు ముందొకసారి తన స్మృతి ప్రవాహానికి ప్రచోదన నిచ్చిన ఆ ట్రక్కు అక్కడినుంచి ఏరోజో వెళ్ళిపోయిందని - అక్కడి చెత్తనంతా నింపుకుని ! క్రింద స్వేచ్ఛంగా పడుకున్న ఆ రస్తాను చూచి, అర్థంకాని సమాధానమొకటి మనస్సును ఆవరించింది : ఆ రస్తాకూ! తనమనస్సుకూ అదేం సంబంధమో !

"ఇంకా తయారు కాలేదేమో? ఈ రోజు ఆదివారం. చౌపాటికి పోవాలి కదూ?"

"లేదింద్రాణీ, బావ ఒక స్నేహితుడి పెళ్ళి కెళ్ళాడు ఇంట్లో అక్కయ్య ఒక్కతే వుంటుంది."

లోపల లలితకు పాలుపడుతూ పడుకున్న నిర్మల అక్క అడిగింది : "అలా ఎందుకునిమ్మీ, పోకూడదా ? నాకొకదానికే వుండడానికేం భయమా ?"

నిర్మల భయాన్ని చెవిలో వేసుకోకుండా ఇంద్రాణి : "అరగంటలో తయారుకావాలి,చూడు. కుముద మనకోసం వేచివుండొచ్చు. ఈ రోజు నరిమన్ పాయింట్ దాకా పోదాం" అంటూ చిలిపిగా ఒకసారి చూసి, నవ్వి, అక్కడినుంచి అదృశ్యమైంది.

చౌపాటికి పోవడానికి తయారవుతూన్నప్పుడు ఇంద్రాణిమాటలనే నెమరుకు తెచ్చుకుంటూ నిర్మల తనలో తనే నవ్వుకుంటోంది. పిచ్చిపిల్లలు ! చౌపాటికి వెళ్ళి, అక్కడ మూగిన మగపిల్ల వాళ్ళను గురించి మాట్లాడుతూ, వాళ్ళవైపు గుడ్లప్పగించి చూస్తూ, కూచోడంలో వీళ్ళకెంతటి సుఖమో ! పాపం ! అందులో వాళ్ళ తప్పు మాత్రమే నుంది ? ఇద్దరూ ఆఫీసులో పనిచేసేవాళ్ళు. వారమంతా పనిచేసి అలసిపోయిన వాళ్ళకు తీరిక దొరికేది ఒక ఆదివారంనాడు మాత్రం. అప్పుడు మానసోల్లాసాని కోసం పాపరహితమైన ఈ పిల్లాట ఆడితే— అనుభవజ్ఞురాలైన వృద్ధమహిళలా (మహాగౌరవనీయురాలిలా!) నిర్మల మనస్సులోనే క్షమించింది-వయస్సులో తన కన్న పెద్ద వాళ్ళైన తన మిత్రురాండ్రను !

అద్దం ముందు నిలుచుని, చౌపాటికి వెళ్ళడానికోసం ముస్తాబవుతూన్న నిర్మల నుద్దేశించి, లోపలి గదిలోవున్న అక్క అడిగింది - తమాషాకే:

"నిమ్మీ. గత యేడెనిమిది రోజులుగా చూస్తూన్నా : నీవు మొదటిలాగా లేదే తల్లీ. నీకు ప్రాణం హాయిగా లేదా ?"

"ఛీ ! ఛీ! అలాయేం లేదే ?"

"అలాయేం లేదంటే అయిందా? ముందంతా ఆదివారం వచ్చిందంటే మిత్రురాండ్రు ఎప్పుడొస్తారు, చౌపాటి కెప్పుడు వెళ్లేను ? అంటూ ఎదురుచూస్తూండే దానివి, ఈ రోజు ఆ ఇంద్రాణి వచ్చినప్పుడు — నాన్నకు ఉత్తరంరాసి పడేయడం మేలేమో, వీలైనంత వేగంగా రెండో అల్లుడిని—"

"ఊరకుండవే !— నీకూ యిలానే అయిందేమే—?"

"అవును కదూ ! నాకూ ఇలా అయిందనే అడిగా. ఇంతకూ నామాట నిజమో, కాదో ?"

అక్క గట్టిగా నవ్వేసింది. నిర్మల ముఖం సిగ్గుతో ఎర్రబడింది · అక్కకు తెలిసిపోయిందా - తన తలలో ఆ ప్రక్కగదిని గురించీ, అక్కడ వుండటానికి వస్తూన్న అనంతుడిని గురించీ, ఎంతటి కోలాహలం నడుస్తూన్నదో !

అనంతుడు !—అనంతుడు!—అనంతుడు !

నిజానికి అనంతుడి ఆగమన వార్త వచ్చిన ఈ మూడేదినాల్లో తను - అదెంతగా మారిపోయింది!— ఎంత పరివర్తన చెందింది !! ఆస్పృహలోనే నిర్మలకు విలక్షణమైన సుఖం వుందనిపించింది: సంతృప్తి కలిగింది. అనంతుడు వ్యాపించివున్న ఆమె దేహమూ, మనస్సూ, ఆత్మా - వీటియొక్క మూలమూలలు కూడా స్వచ్ఛపడినాయి - పావనమైనాయి ?

స్నానాల గది మురుగు నీటిలో వేళ్ళూనిన మల్లికాలత తన కొమ్మ కొమ్మలోనూ, రెమ్మ రెమ్మలోనూ గుమ గుమలాడే పూలు దాల్చి నిలిచింది.

ఆహా ! అదెంతటి సుఖం ! ఉన్మాదం ! ధన్యత! - ముందరవున్న అద్దం ప్రతిబింబించిన తన అనుపమ సౌందర్యాన్ని చూసి, తన్ను తానే మోహించి నిలిచిన నిర్మల మనస్సు ప్రసన్నమైంది !

అప్పుడే - ఆమె స్నేహితురాలు కుముద బిరబిర లోనికి వచ్చింది:

"అయిందేమే నీ ముస్తాబు—హమ్మయ్య ! ఎంత అందంగా కనిపిస్తూన్నావే ! ఈ రోజెవరు వస్తారే నిన్ను చూసేందుకు ?"

నిర్మలకు సిగ్గుతో నోట మాటరాలేదు. ఎవరొస్తారే నిన్ను చూసేందుకు ? ఎవరొస్తారు ?— ఎవరు ?— (అనంతుడు ?) —? నిర్మల అద్దంలోని తన ప్రతిబింబాన్నే ప్రశ్నిస్తోంది- మూగవోయి.

"ఎవరొస్తారన్నప్పుడు గుర్తొచ్చింది చూడు," అంటూ ఏదో జ్ఞప్తికి వచ్చినట్లు, కుముద కుడి ప్రక్క గదివద్ద నిలబడి, నిర్మల అక్కను, "సుశీలక్కా," అంటూ పిలిచింది. ఆమె అక్కడ లేకుండటం తెలుసుకుని, "అరే, సుశీలక్క లేదేమే ?" అంటూ అడిగింది నిర్మలను.

అద్దంలో తన ప్రతిబింబాన్ని చూడటంలో ఇంకా నిమగ్నురాలై వున్న నిర్మల-ఆ ప్రక్కతిరిగి చూడకనే చెప్పింది.

"ఇప్పుడిక్కడే వుండిందే, లలితకు పోలుపడుతూ. స్నానాల గదికేమైనా వెళ్ళిందేమో?"

"నిర్మలా ఒక వార్త విన్నావేమే? ఆ రోజు నీకు చెప్పడం మరచేపోయాను."

నిర్మల ఇంకా కుముద ప్రపంచానికి రాలేదు. అది తెలియకనే కుముద చెప్పుకు పోయింది.

"మీ ప్రక్క ఖాళీగదిలేదూ? అక్కడ వుండటానికి—"

నిర్మల ఆశ్చర్య చకితయై ఒక్కసారిగా ముఖం తిప్పి నిలుచుంది, ఆమె ముఖం మీద మొలకెత్తిన ఆ కుతూహల భావం గమనించి, కుముద చెప్పింది.

"అంటే, నీకు తెలుసేమి?"

నీకూ తెలుసా? నా అనంతుడిని గురించి నాకు కాకుండా ఇంకెవరికి తెలుస్తుందే, పిచ్చిదానా? అయితే ఇదంతటినీ గురించి నీకేం తెలుసే? నీకెలా తెలుసే? చెప్పవే, చెప్పవే—అలా ఎందుకు మిటకరించి చూస్తావు?—? ఒకటి తరువాత ఒకటిగా మూగ ప్రశ్నలు నిర్మల ముఖం మీద మెరసి, మాయమైనాయి.

"లేదు. నాకేమీ తెలీదు" నిర్మల అబద్ధం చెప్పింది.

"అక్కడ నుండేందుకు అనంత కులకర్ణి అనే యువకుడు రావలసి వుండేది—"

రావలసివుండేది? అంటే? ఇపుడురాబోడా? అయ్యో! ఆపవద్దే, మహాతల్లీ—వేగ వేగ చెప్పి ముగించు— బతిమాల్తాను: నిర్మల హృదయం దడ దడ కొట్టు కుంటూంది.

'మా నాన్నగారికి తెలిసినవాడు. చదవటానికి బొంబాయిలో ఒక కాలేజీలో ఉండినాడట. బి. ఏ. పాసయ్యాడు. మాంచి బుద్ధిమంతుడు. బి. ఏ. ఫస్ట్ క్లాస్—వయస్సు కేవలం ఇరవై అయిదు... చూచేందుకు ఎంతందగాడనుకున్నావ్!—"

అదంతా నాకు తెలుసే నీ కన్నా యెక్కువ తెలుసు. ఆ మాటలన్నీ ఇప్పుడొద్దే. అతడిపుడు వస్తాడో, రాడో. అది మొదట చెప్పు; నిర్మల ప్రాణం భయగ్రస్త మయింది.

"అయితే దురదృష్టం చూడు. బి. ఏ. పరీక్ష పాసైన కొద్ది రోజులకే ఒక విచిత్ర రోగం - ఒక రకపు పక్షవాతం-నాలిక సరిగ్గా పని చేయలేకపోయింది. మాటలు పడిపోయాయి. ఈ గొంతునరాల్లేవూ - అవి యిలా వుబ్బి ఇంత పెద్దవిగా అవుతూండేవట - వూపిరాడనట్లు! ఎవరైనా మాటలాడించడానికి ప్రయత్నిస్తే, వల వల యేడ్వటం—"

నిర్మల ముఖం తెల్లబోయింది. గొంతు నరాలుబ్బాయి. కళ్ళు చెమ్మగిల్లసాగాయి, ఇదంతా తన కథా కథన ప్రావీణ్య పరిణామమంటూ తప్పుగా అర్థం చేసుకున్న కుముద మంచి ఆసక్తికరంగా తన దురంత నాయకుని కరుణ కథను చెప్పుకుపోతూంది:

"అంతమంది డాక్టర్ల మందులూ ఆయిపోయాయి. అయితే ఒక్కరికూడా రోగం యేమన్నది సరిగ్గా తెలియలేదు. చివరికి బొంబాయి డాక్టర్లతో ఉపచారం చేయించుకోవడానికి ఇక్కడికి తెచ్చేందుకు ప్రయత్నిస్తూన్నారు- అతడి తల్లి తండ్రులు.

మా నాన్నగారి ద్వారా ఈ గది ఆచూకీ కనుక్కొని, ఇంటి యజమానికి పగిడీ యిచ్చి, ఈ గది బాడుగకు తీసుకున్నారు. ఎనిమిది రోజుల క్రితమే రావాల్సి వుండేది. అయితే, చెబితే నీవు నమ్మవనుకుంటాను. తన్ను బొంబాయికి తీసుకువెళ్ళుతారన్నది తెల్సినంతనే అతడి రోగం ఒక్కుమ్మడిగా ఎక్కువైంది. దినమంతా యేడ్చి, యేడ్చి కళ్ళు వాచిపోయాయి—"

నిర్మల సహనం నశించిపోయింది. ఉన్నదున్నట్లే కేకేసింది. "తర్వాత?"దాని స్పృహలేని కుముద సరాగంగా చెప్పింది: "తర్వాత కన్నీళ్ళు నిలిచిపోయాయి. అయితే క్రమేణా పరిసర జగత్తుకు సంబంధించిన స్పృహ తక్కువవుతూ వచ్చింది. చివరికి ఒక చిక్కని నెలకొన్న తెరచిన దృష్టి అక్కడినించి చలించలేదు. గాబరాపడి డాక్టర్లను పిలిపిస్తే అదొకరకం మూర్ఛ అన్నారు— మూడు రోజుల క్రితం అతడి తండ్రి నుంచీ మా నాన్నకు టెలిగ్రాం వచ్చింది. ఈ మూర్ఛ నుంచి తేరుకుంటూనే వస్తామని. అయితే ... ఈ రోజు ప్రొద్దున మళ్ళీ జాబు వచ్చింది! అతడు మూర్ఛనుంచీ తేరుకొనేలేదని—"

"ఆం!!!" దంగైపోయిన దానిలా విన్నది నిర్మల.

"అతడు చనిపోయాడు" తన మాటల అర్థం స్పష్టపరచి చెప్పింది, కుముద. అయితే అంతసేపటికి నిర్మల కళ్ళలో చీకట్లు క్రమ్మినట్లై కుర్చీలో కూలబడింది. మిత్రురాలి ఈ విచిత్ర ప్రవర్తన చూచి, కుముద గాభరా చెందంది.

"అరే, నీకేమైందే? నీకు తేవాలేమే? అక్కను పిలిచేదేమే?"

కుముద గాభరా చెందిందని తెలిసి, నిర్మల ఒక్కసారిగా తను సర్దుకుంటూ, "ఏంలేదు, ఏంలేదు. నేను బాగున్నాను. నీవు ఇక్కడి కొచ్చేందుకు కొంతసేపు ముందు ఇదే కిటికీలో ముఖం పెట్టుకుని నిలుచుకుని వుండినాను. ఎండ నొసటికే తగలడంచేత తల

కొంచెం తిరిగినట్లయింది!'' నిర్మల అబద్ధం చెప్పి, నవ్వడానికి ప్రయత్నించింది. అయితే అందుచేత కుముదకు సమాధానం కలుగ లేదు. తను అనంతుడిని గురించి చెప్పిన దుర్వార్తవల్ల నిర్మల యెదకు తగిలిన దెబ్బ ఆమె గమనించకపోలేదు. వెంటనే తప్పు చేసిన దానిలా నిర్మల వీపును నిమురుతూ అడిగింది.

"క్షమించు నిర్మలా అనంతుడు నీకేమైనా బంధువా?''

ఈ ప్రశ్న వల్ల అప్పటిదాకా ఆపబడిన నిర్మల కన్నీళ్ళు ఒక్కసారిగా ప్రవహింప మొదలుపెట్టాయి. ఆమె తనకు తెలియ కుండానే కుముద ప్రశ్నకు ఔనని తలాడించింది. అప్పుడు కుముదకు తను అనంతుడి మరణవార్తను చెప్పిన పద్ధతిలోని దురుసుతనం తెలిసింది ఆమె.

"ఓం! క్షమించు నిర్మలా. నాకు తెలిసే తెలీదు. అనంతుడు మీ బంధువని!—కొంచెం సర్దుకో. ఈరోజు నీవు చౌపాటికి రానే రావద్దు. వచ్చే ఆదివారం పోదాం. మిగిలిన స్నేహితురాండ్రకూ చెప్పి, ఈ దినం కార్యక్రమాన్నే రద్దు చేయిస్తాను.'' అన్నది.


## రు. 1,50,000 విలువైన బహుమతులు గెలవండి.

## ఎంట్రీ రుసుము లేదు

| | | |
|---|---|---|
| 6 | 11 | 4 |
| 5 | 7 | 9 |
| 10 | 3 | 8 |

| | | |
|---|---|---|
| 7 | | |
| | 8 | |
| | | 9 |

మొదటిబహుమతి: ఎల్.ఎమ్.ఎల్.150 స్కూటర్, వి.సి.ఆర్. కన్సోలేషన్ బహుమతి : టూ-ఇన్-వన్, ట్రాన్సిస్టర్, ఫోటోగ్రాఫిక్ కెమెరా మ్యూచువల్ బెనిఫిట్ స్కీము ద్వారా పొందవచ్చును.

చూపించిన నమూనా ప్రకారము 9 గళ్లను పోష్టుకార్డు మీద తయారుచేసి 4 నుండి 12 నెంబర్లు ఉపయోగించి నిలువుగా, అడ్డముగా, ఏటవాలుగా కూడిన మొత్తము 24 రావలయును. 1 నెంబరును ఒకసారి మాత్రమే ఉపయోగించ వలెను. 15 రోజులలోపు మీ ఎంట్రీలను పంపవలెను. మొదటి 10 ఎంట్రీలకు చేతిగడియారము - ఉచితముగా మీ ఎంట్రీలను ఆర్డినరీ పోష్టుకార్డుమీద పంపవలెను.

DEEPAK ENTERPRISES (D-MBH)
Post Box No. 36
AMBALA - 133 001


తన్ను ఈ నిర్ణయం నుంచీ కదిలించడానికి యత్నించిన నిర్మలను అర్థాంతరంగా ఆపి.

"వద్దు నిర్మలా. నీవు మాట్లాడనేవద్దు. నేను రాత్రికి మళ్ళీ వస్తాను. నీవిప్పుడు కొంచెం విశ్రాంతి తీసుకో. నా దురుసుతనాన్ని మాత్రం క్షమించు అంతే'' అంటూ మరొకసారి ఆమె వీపును మెల్లగా నిమిరి, విషణ్ణ వదనంతో గది బయటికిపోయి తన వెనుకగది తలుపు మూసింది.

స్నేహితురాలు వెళ్ళిపోయిన కొంచెం సేపటికి నిర్మలకు జ్ఞానోదయమైంది. మూడు రోజుల క్రితం తను అనంతుడి గురించి విన్న మాటల సందర్భం ఇప్పుడు తెలిసింది; కుముదా వాళ్ళ ఇంటివాళ్ళ నించీ అనంతుడి సంగతి విన్న ఒక మహిళ మరొక్క మహిళకు ఆ విషయం చెప్పివుండాలి! గత పదిహేను రోజులుగా ఆ ఖాళీగది తనలో ప్రేరేపించిన కల్పనల మత్తులోనే వుండిన తన మాత్రం అక్కడక్కడ వినిపించిన ఆ మాటల్లో కూడా తనకు ప్రియమైన సందేశాన్నే చదివివుండాలి!_ "అనంతుడు ఇరవై అయిదేళ్ళ యువకుడు—చూడడానికి మన్మధునిమూర్తి'' _ ఈ వర్ణన వెనకాలగల భావపు అర్థమూ ఇప్పుడు నిర్మలకు తెలిసింది; అందులో ఆసక్తి కన్నా కనికరమే ఎక్కువగా నిండివుంది! నిర్మలకు తన పిచ్చి తనాన్ని తలుచుకుని గట్టిగా నవ్వాలనిపించింది. ఎవరైనా నమ్ముతారా? ఎవరో! ఏమో! గాలిలో తేలివచ్చిన వట్టి ఒక వార్త శకలం వల్లనే తను అనంతుని గురించి అంతలేసి పగటి కలలుకని, అతడి చావును గురించి విని ఇప్పుడు ఏడుస్తూన్నానుకదా! పిచ్చో! పిచ్చి! అక్కకూ, తన స్నేహితురాండ్రకూ ఈ సంగతంతా తెలిస్తే, ఎంతగా నవ్వుతారో! నిర్మలకు తను కూడా పడి పడి నవ్వాలనిపించింది. అయితే ఆశ్చర్యమేమంటే- నవ్వాలని యత్నించిన కొద్దీ, ఆమె కళ్ళలో నీళ్ళే ఉబ్బొంగి, ఉబ్బొంగి వస్తూన్నాయి.

అనంతుడి చావువల్ల తన కళ్ళలో నీళ్ళెందుకు?

అనంతుడికీ తనకూ సంబంధమా? ఏం సంబంధం?

అనంతుడు నిజంగా చనిపోయాడా? తన మన్మధుడిలాంటి అనంతుడు!

తన మనోగర్భంలోనే ఉద్భవించి, తన ప్రతి అవయవాన్ని వ్యాపించి, ఇప్పుడు తన్నే మీరి నిలిచిన అనంతుడు - ఈ అనంగుడైన అనంతుడు - మరణించగలడా? - ఆమెకు తెలియలేదు!

తన కన్నీళ్ళ కర్థం తనకే తెలియలేదు!

అయితే -

క్షణ క్షణమూ తన కన్నీళ్ళు ఎక్కువవుతూన్నాయి.

ఇక్కడ చిట్ట చివరిదాకా, ఖాళీగానే మిగిలిపోయిన ఆ ప్రక్క గది, దీనినంతా చూసీ చూడనట్లు, దీనికీ తనకూ సంబంధమే లేదన్నట్లు, నిర్వికారంగా నిలబడివుంది - తన అన్ని తలుపులనూ భద్రంగా మూసుకుని!